# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 12-01-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **కొత్త ఆవిష్కరణల ద్వారా నిర్మించే జాతీయ రహదారుల నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాగస్వామ్యం కావాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కోరారు.**

2. **రాష్ట్ర రెవిన్యూ శాఖలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పారదర్శకంగా, వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

3. **రక్త దానం చేసేందుకు యువత ముందుకు రావాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు.**

4. **రాజధాని అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం వంటి నిర్మాణాల కోసం రెండవ విడత భూ సమీకరణ చేపట్టామని మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు.**

==========================

జాతీయ రహదారుల నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యతనిస్తున్నామని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో చేపట్టిన బెంగళూరు-కడప-విజయవాడ ఆర్థిక కారిడార్ నిర్మాణ పనుల్లో 4 గిన్నిస్ రికార్డులు సాధించిన సందర్భంగా కేంద్రమంత్రి దృశ్యమాధ్యమం విధానంలో నిర్వహించిన కార్యక్రమంలో అమరావతి నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. బెంగుళూరు-విజయవాడ ఆర్థిక కారిడార్ 4 గిన్నిస్ రికార్డులను సాధించడం అభినందనీయమన్నారు. కొత్త ఆవిష్కరణల ద్వారా జాతీయ రహదారులను నిర్మించేందుకు కేంద్రప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ ప్రయత్నాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాగస్వామ్యం కావాలనీ కోరారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఈ కారిడార్‌కు అమరావతి-బెంగుళూరు రహదారిగా నామకరణం చేయాలని కేంద్రమంత్రిని కోరారు.

--------------------------

రాష్ట్ర రెవిన్యూ శాఖలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పారదర్శకంగా, వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర మంత్రులు, కార్యదర్శులతో ముఖ్యమంత్రి ఈరోజు సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆదాయార్జన, పెట్టుబడులు,

ఆన్‌లైన్ సేవలు, వాట్సాప్ గవర్నెన్స్ వంటి అంశాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం రెవెన్యూ శాఖలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ, సర్వే, ఫిర్యాదుల పరిష్కారం, వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. రీసర్వే ప్రక్రియ ద్వారా రెవెన్యూ రికార్డులను నవీకరణ చేపడుతున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ .. 30 సెకన్లు

-------------------------

బాలికల విద్య సామాజిక మార్పునకు, దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని ఒడిశా రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలంలోని ఉంగుటూరులో నివేదిత గురుకులం నూతన భవనం ప్రారంభోత్సవంతో పాటు ద్వితీయ వార్షికోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నిన్న ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ హరిబాబు మాట్లాడుతూ, గురుకులం విద్యతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందన్నారు. బాలికల విద్యకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యతనిస్తున్నాయని చెప్పారు. ప్రాథమిక విద్యకు బలమైన పునాది ఉండాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం 2020ను తీసుకువచ్చిందని తెలిపారు.

-------------------------

రక్త దానం చేసేందుకు యువత ముందుకు రావాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కోరారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ప్రభుత్వ సిద్ధార వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మంత్రి ఈ రోజు ప్రారంభించారు. రక్తదానం చేసిన వారికి ధృవపత్రాలను అందజేశారు. అనంతరం సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, రక్త దానం ప్రతీ ఒక్కరూ చేయాల్సిన సామాజిక బాధ్యత అన్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయని రక్త దానం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ .. 30 సెకన్లు

-------------------------

పేదల ఆరోగ్య సంరక్షణకు ముఖ్యమంత్రి సహాయనిధి దోహదపడుతుందని జలవరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 25 లక్షల 98 వేల రూపాయల చెక్కులను 57 మంది లబ్ధిదారులకు నిన్న అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఏడాదిన్నర కాలంలో ఒక్క పాలకొల్లు నియోజకవర్గంలోనే 9 కోట్ల 80 లక్షల రూపాయలను అందించామని చెప్పారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అర్హులైన వారు వైద్య ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకుంటే వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సహాయం అందజేస్తామని మంత్రి వివరించారు.

-------------------------

తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం – షార్ నుంచి పీఎస్ఎల్వీ–సీ62 రాకెట్ ను ఈ ఉదయం 10.18 గంటలకు ఇస్రో ప్రయోగించింది. 'ఈఓఎస్–ఎన్1'తో పాటు భారత్, యునైటెడ్ కింగ్‌డమ్, థయ్‌లాండ్, బ్రెజిల్, స్పెయిన్, నేపాల్ తదితర దేశాలకు చెందిన మరో 14 చిన్న

ఉపగ్రహాలను ఈ రాకెట్ తీసుకువెళ్లింది. ఈ ప్రయోగ వివరాలను ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ పాత్రికేయులకు వెల్లడించారు. ప్రయోగం మొత్తం నాలుగు దశల్లో పూర్తి కావాల్సి ఉందని, మూడో దశ వరకు బాగానే జరిగిందని, ఆ తర్వాత కొంత అంతరాయం ఏర్పడిందని తెలిపారు. మూడో దశ చివర్లో రాకెట్ నిర్దేశించిన మార్గంలో వెళ్లలేదని, సమస్యకు గల కారణాలను విశ్లేషించి వివరాలను ప్రకటిస్తామని ఆయన తెలియజేస్తూ,

వాయిస్.. 35 సెకన్లు

---------------------------

దేశానికి కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అభివృద్ధిలో జాప్యానికి కారణమయ్యే సమస్యలను పరిష్కరించడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న Pro-Active Governance and Timely Implementation- ప్రగతి సమావేశాలు దోహదపడ్డాయి. ఇందులో భాగంగా ప్రగతి సమావేశం ద్వారా నిర్మితమైన మహారాష్ట్ర లోని నాగ్‌పూర్ ఎయిమ్స్ ప్రాజెక్టు గురించి ఈ రోజు తెలుసుకుందాం.

మహారాష్ట్ర తూర్పు భాగంలోని విదర్భ ప్రాంతంలో ఆరోగ్య సంరక్షణ కోసం నాగ్‌పూర్‌లో అఖిల భారతీయ వైద్య, విజ్ఞాన సంస్థ- ఎయిమ్స్ ప్రాజెక్ట్ అక్టోబర్ 7, 2015న ప్రారంభమైంది. దీని కోసం వెయ్యి 577 కోట్ల రూపాయలను కేటాయించారు. నిర్మాణ సమయంలో పలు పరిపాలన సమస్యలు తలెత్తాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2017 ఆగస్టు 30న ప్రగతి యంత్రాంగం కింద ఈ ప్రాజెక్టును సమీక్షించారు. కేంద్రీకృత పర్యవేక్షణ, అమలు సవాళ్లను సకాలంలో పరిష్కరించడంతో, ఈ ప్రాజెక్ట్ 2021 డిసెంబర్ 30న పూర్తయింది. దీంతో నాగ్‌పూర్ ప్రజల ప్రజారోగ్య సంరక్షణకు కీలకంగా నిలిచి లక్షలాది మంది పౌరులకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణను పొందడంలో ప్రాంతీయ అసమతుల్యతలను సరిదిద్దాలనే ప్రధానమంత్రి సంకల్పాన్ని ప్రగతి సమావేశం ప్రతిబింబిస్తుంది.

---------------------------

రాజధాని అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం, క్రీడా నగరం, రైల్వే ట్రాక్ వంటి నిర్మాణాల కోసం రెండవ విడత భూ సమీకరణ చేపట్టామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం కర్లపూడి-లేమల్లె గ్రామంలో రెండవ విడత భూ సమీకరణ ప్రక్రియను మంత్రి ఈ రోజు ప్రారంభించారు. స్థానిక శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ తో కలిసి రైతుల నుంచి అంగీకార పత్రాలను స్వీకరించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ, రెండవ దశ భూసమీకరణలో 2 వేల 654 ఎకరాలకు నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. రెండవ దశలో ఇప్పటివరకు మొత్తం 7 గ్రామాలకు గానూ 4 గ్రామాల్లో భూ సేకరణ ప్రారంభమైందని మంత్రి వివరించారు.

---------------------------

యువతే దేశ భవిష్యత్తు అని చాటిన వ్యక్తి స్వామి వివేకానంద అని ప్రకాశం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఒంగోలులోని కొత్తపట్నం బస్టాండ్ కూడలి వద్ద ఆయన విగ్రహానికి ఈరోజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

=====================